విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 93	శనివారం	31-10-2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:93	Saturday	31-10-2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

లండన్‌లో ఉందని అనుకుంటే.. పుణే ఫ్లాట్‌లో శవమై కనిపించిన మహిళ!

లండన్‌లో ఎంబీఏ చదువుతోందని కుటుంబసభ్యులు భావిస్తుండగా, ఓ మహిళ పుణేలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఛత్రపతి సంభాజీనగర్‌కు చెందిన ముగ్ధా దేశ్‌ముఖ్ (34) పింప్రి చించ్‌వాడ్‌లోని ఓ ఫ్లాట్‌లో శవమై కనిపించడం తీవ్ర కలకలం రేపింది. కుటుంబానికి తెలియకుండా ఆమె యూకే నుంచి రహస్యంగా తిరిగి రావడం, ఆపై మరణించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే, ముగ్ధా దేశ్‌ముఖ్ 2025 జులైలో ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లింది. అక్కడే ఉంటూ ఎంబీఏ చదువుకుంటున్నట్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నట్లు కుటుంబసభ్యులతో నిరంతరం ఫోన్, మెసేజ్‌ల ద్వారా మాట్లాడుతూ ఉండేది. అయితే, కుటుంబసభ్యులకు తెలియకుండా ఆమె 2026 ఆగస్టులోనే రహస్యంగా భారత్‌కు తిరిగి వచ్చింది.

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- ౦ పశ్చిమగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- ౦ తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- ౦ 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- ౦ తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- ౦ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- ౦ అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. "ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది.

- మిగతా 2వ పేజీలో

రేపు కేంద్ర బృందం.. తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

- ౦ అర్నబ్ తుపాను నష్టం అంచనాకు ఏపీకి కేంద్ర బృందం
- ౦ శని, ఆదివారాల్లో ప్రభావిత జిల్లాల్లో అధికారుల పర్యటన
- ౦ సోమవారం నుంచి కరవు మరో బృందం అధ్యయనం
- ౦ రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పరిశీలన

ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానున్న అధికారులు

2లో

'ఢిల్లీ ర్యాలీకి ప్రజలు రాకుండా అడ్డంకులు"..

- ౦ రాంలీలా మైదాన్ ర్యాలీ ప్రతిపక్షాల ఉద్యమం..
- ౦ ఓట్లు కోల్పోతున్నామనే బాధ ప్రజల్లో ఉంది..
- ౦ కేంద్రంపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు..



రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

- ౦ మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- ౦ భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- ౦ రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- ౦ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- ౦ భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు.

- మిగతా 2వ పేజీలో

హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం..

- ౦ హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ౦ ప్రధాన రహదారులన్నీ జలమయం
- ౦ పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
- ౦ ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- ౦ ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు

- మిగతా 2వ పేజీలో

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం..

ఆరుగురి మృతి

- ౦ ఉత్తరాఖండ్‌లోని జోషిమర్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- ౦ బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- ౦ మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ౦ ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- ౦ వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్



నా చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే'..

" నా జీవితంలో చివరి శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాను" అని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల పాట్నాలో జరిగిన సమావేశంలో "మోడీ నాన్న కూడా వెళ్లిపోతారు" అని వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని కుటుంబాన్ని కాంగ్రెస్ టార్గెట్ చేస్తోందని దుయ్యబట్టారు.

ఇస్రో మరో ఘనత..

- ౦ నింగిలోకి దూసుకెళ్లిన ఎన్‌వీఎస్-03 శాటిలైట్
- ౦ ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో
- ౦ భారత నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ'కి పెరగనున్న బలం
- ౦ కనీస కార్యాచరణకు అవసరమైన 4 ఉపగ్రహాల మైలురాయి పూర్తి
- ౦ దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారం ఈ ఉపగ్రహంలో మరో ప్రత్యేకత
- ౦ పౌర, సైనిక అవసరాలకు స్వదేశీ నావిగేషన్ సేవలు బలోపేతం

నా చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే'..

ఇప్పుడు ఈ వ్యాఖ్యలకు మోడీ కౌంటర్ ఇచ్చారు. గుజరాత్ బనస్కాంత జిల్లా భిల్డి పట్టణంలో భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ సభలో ప్రసంగించారు. ఈ పర్యటనలో భాగంగా సుమారు రూ.14,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. దేశ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు కొందరు సంతోషిస్తున్నారని మోడీ విమర్శించారు. దేశానికి కష్టం వచ్చిన ప్రతీసారి వారు ఆనందిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పశ్చిమాసియా పరిణామాలో రైతులకు ఎరువులు అందడం లేదని కొందరు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మోడీని అప్రతిష్టపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, వంటగ్యాస్ దొరకదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. యుద్ధ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత రైతులకు ఎరువుల కొరత రానీయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మోడీ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువులు ధరలు పెరిగాయని, అయినప్పటికీ భారత రైతులపై భారం పడకుండా ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా డీఏపీ బస్తా ధర రూ.5,000 దాటినా, భారత రైతులు దానిని రూ.1,350కే పొందుతున్నారని చెప్పారు. గుజరాత్ నుంచి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడతను కూడా మోదీ విడుదల చేశారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం..

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

'ఢిల్లీ ర్యాలీకి ప్రజలు రాకుండా అడ్డంకులు"..

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ప్రతిపక్ష ఇండియా కూటమి నవంబర్ 1న భారీ ర్యాలీని తలపెట్టింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. దాదాపుగా 10 లక్షల మంది ర్యాలీకి హాజరవుతారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే, ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వస్తున్న ప్రజల్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ ఆరోపణలు చేశారు. ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య ప్రజలు రాకుండా అడ్డంకులు సృష్టి?స్తున్నారని పేర్కొన్నారు. రాంలీలా మైదాన్‌లో జరిగే కార్యక్రమానికి ఎంతమంది వస్తారు, వారిలో ఎంతమందిని అడ్డుకుంటున్నారో గమనిస్తే దేశంలో ప్రస్తుతం ఏం జరుగుతుందో అర్థమవుతుందని ఆయన అన్నారు. కోట్లాది మంది ఓటు హక్కును కోల్పుతున్నారనే ఆవేదన ప్రజల్లో ఉందని, దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని చెప్పారు. అదానీ, అంబానీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లకు ప్రయోజనం చేకూర్చేందుకే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఇది వేర్వేరు నిరసన కార్యక్రమం కాదని, ఒకే ఉద్యమమని ఆయన అన్నారు. మొత్తం ప్రతిపక్షం ఈ పోరాటంలో పాల్గొంటుందని చెప్పారు. నిరసన తెలియజేయాలనుకునే ప్రతీ ఒక్కరూ రాంలీలా మైదాన్‌కు రావచ్చని చెప్పారు.

రేపు కేంద్ర బృందం.. తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

అర్నబ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు, అదే సమయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నెలకొన్న కరవు పరిస్థితులను పరిశీలించేందుకు రెండు వేర్వేరు కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ూూాణపీూ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం వెల్లడించారు. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం శని, ఆదివారాల్లో (అక్టోబర్ 31, నవంబర్ 1) తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుంది. రియల్-టైమ్ గవర్నెన్స్ సెంటర్‌లో తుపాను సమయంలో తీసుకున్న చర్యలు, నష్టంపై అధికారులు కేంద్ర బృందానికి వివరించనున్నారు. అనంతరం ఈ బృందం రెండుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. ఒక బృందం కోనసీమ, కాకినాడ జిల్లాల్లో, రెండో బృందం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నష్టాన్ని పరిశీలిస్తుంది. ఈ బృందం సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానుంది. ఇదిలా ఉండగా, 2026 ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న కరవు పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని మరో బృందం నవంబర్ 2, 3 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తుంది. పది మంది సభ్యులున్న ఈ బృందం రెండుగా విడిపోయి శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 283 మండలాలను తీవ్ర కరవు, 105 మండలాలను మధ్యస్థ కరవు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బృందం నవంబర్ 4న ముఖ్యమంత్రితో భేటీ కానుంది. తుఫాను నష్టం అంచనా బృందం సభ్యులు: చిత్తరంజన్ దాస్ (జాయింట్ సెక్రటరీ, హోంశాఖ), ప్రశాంత్ ఆర్మోరికర్ (వ్యవసాయ శాఖ), రేఖారాణి కొల్లు (జలశక్తి మంత్రిత్వ శాఖ), హిమాలయ గర్గ్ (ఆర్థిక శాఖ), రాకేశ్ కుమార్ సింగ్ (రోడ్డు రవాణా), అలోక్ జవహర్ (గ్రామీణాభివృద్ధి), ప్రణయ్ గర్గ్ (విద్యుత్ శాఖ), డా. ఎస్.వి.ఎస్.పి. శర్మ (ఇస్రో). కరవు అధ్యయన బృందం సభ్యులు: చిన్మయ్ గోట్మారే (జాయింట్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ), ప్రభా కాంతి (వీచీజఖీజ), వినోద్ సమంత్ (గ్రామీణాభివృద్ధి), పంకజ్ పహాడియా (ఆర్థిక శాఖ), ఎన్.వి. సతీష్ శీమకుర్తి (డైరెక్టరేట్ ఆఫ్ మానిటరింగ్), డా. కె. పొన్నుసామి (నూనె గింజల అభివృద్ధి), అనురాధ బటానా (నీతి ఆయోగ్), ధీరేంద్ర కుమార్ (=×జ), ప్రదీప్ కుమార్ (ప్రజా పంపిణీ), డా. సాక్షి భదౌరియా (పశుసంవర్ధక శాఖ).

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. "రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తొలుత గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం" అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు. అనంతరం మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, "ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా" అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన, సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. షెల్టర్ సందర్శన అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. 'అర్నబ్' తుపాను ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించానని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయని అన్నారు. "రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశాం. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగాం. అయినప్పటికీ, దురదృష్టవశాత్తూ ఏడుగురు మరణించడం బాధాకరం" అని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామని తెలిపారు. తుపాను వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ మేరకు కేంద్రానికి నివేదిక పంపామని చెప్పారు. పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని, నష్ట తీవ్రతను పరిశీలించేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని వెల్లడించారు. తుపాను కష్టకాలంలోనూ రైతులకు అండగా నిలుస్తూ, పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశారు.

ఇస్రో మరో ఘనత..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ' (చీుఖజ×జ)ను బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం రాత్రి 11:51 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన దాదాపు 20 నిమిషాల తర్వాత, 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ విజయవంతంగా నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రయోగ విజయంతో, నావ్‌ఐసీ వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీస నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఇది దేశీయ స్థాననిర్ణయ, నావిగేషన్, టైమింగ్ (పీఎన్‌టీ) సేవలకు భరోసానిస్తుంది. ఈ ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం మరో విశేషం. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతో పాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. దీనివల్ల భారత భూభాగంతో పాటు, దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. గతంలో మొదటి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు రావడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో విఫలం కావడం వంటి అడ్డంకులను అధిగమించి ఇస్రో ఈ విజయాన్ని సాధించింది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్‌వీ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ప్రస్తుతం ఉపగ్రహం తన ఆన్‌బోర్డ్ ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలు చేపడుతుంది. అనంతరం తుది పరీక్షల తర్వాత ఇది నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తు నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతో పాటు, సైనిక వ్యూహాత్మక అవసరాలకు కూడా నావ్‌ఐసీ వ్యవస్థ అత్యంత కీలకం కానుంది.

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

ఉత్తరాఖండ్‌లో శుక్రవారం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ దుర్ఘటన విషాదాంతంగా ముగిసింది. బద్రీనాథ్ నుంచి సహస్త్రధార వెళుతున్న ఓ ప్రైవేట్ హెలికాప్టర్ జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామ సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పైలట్‌తో సహా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త అందిన వెంటనే ఉత్తరాఖండ్ పోలీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ూణ=ఖీ), ఆర్మీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ హిమాన్షు సభర్వాల్ (ఢిల్లీ) కాగా, ప్రయాణికులను ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్ కె, హెచ్.ఎస్. నటరాజాగా గుర్తించారు. వీరంతా కర్ణాటకకు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలం నుంచి ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను రోడ్డు మార్గం ఉన్న ప్రాంతానికి తరలించే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చమోలీ ఎస్పీ సుర్జీత్

సింగ్ పన్వార్ వెల్లడించిన వివరాల ప్రకారం, "ట్రాన్స్ భారత్ ఏవియేషన్" సంస్థకు చెందిన ఈ హెలికాప్టర్ మధ్యాహ్నం 1.12 గంటలకు బద్రీనాథ్ సివిల్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో జోషిమఠ్ సమీపంలో హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్ గాల్లో ఉండగానే అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడం చూశామని సమీప ప్రాంతాల్లోని స్థానికులు తెలిపారని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖజణూ) కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో పాటు, ట్రాకింగ్ సిస్టమ్ నుంచి కూడా అది అదృశ్యమైనట్లు తెలిపింది.

సంస్థ సేవలు నిలిపివేత

ఈ దుర్ఘటన నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అన్ని హెలికాప్టర్ల సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యూసీడీఏ ప్రకటించింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హెలికాప్టర్ ప్రమాదాలపై ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హరీశ్ రావత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రంలో హెలికాప్టర్ సేవలను సురక్షితంగా మార్చాల్సిన అవసరం ఉంది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తగిన మార్పులు చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

రామ్‌రాజ్ కాటన్ నూతన షోరూమ్ ప్రారంభం

౦ ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

౦ స్థానికులకు అందుబాటులోకి భారతీయ సంప్రదాయ వస్త్రాలు

తొలివెలుగు, బాలాపూర్: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బాలాపూర్ సత్యసాయినగర్, ఆర్‌సీఐ రోడ్డులో ప్రముఖ భారతీయ సంప్రదాయ వస్త్ర బ్రాండ్ రామ్‌రాజ్ కాటన్ నూతన షోరూమ్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. భారతీయ సంప్రదాయ వస్త్రధారణకు ప్రత్యేక గుర్తింపు పొందిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ బాలాపూర్‌లో అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులు సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ సంస్థ జనరల్ మేనేజర్ శైలేంద్ర నాయర్‌తో పాటు ప్రకాష్, గణేష్, సతీష్, రవికుమార్, వెంకటేష్, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఢిల్లీ మహాధర్నాకు రంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు

౦ నేడు రాంలీలా మైదానంలో నిరసన సభ

౦ రైళ్లు, బస్సులు, విమానాల్లో బయలుదేరిన నాయకులు

తొలివెలుగు, బడంగ్‌పేట్: ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సాధన ధ్యేయంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ), 'ఇండియా' కూటమి పిలుపు మేరకు నవంబరు 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న మహాధర్నాకు రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్తున్నాయి. జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విమానాలు, ప్రత్యేక బస్సులు, రైళ్ల ద్వారా శుక్రవారం ఢిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. మహాధర్నాలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి వెళ్లే కాంగ్రెస్ శ్రేణుల కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని టీపీసీసీ విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం అనుమతించలేదని ఆరోపించారు. కేంద్రం అడ్డంకులు సృష్టించినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఢిల్లీకి చేరుకుంటున్నట్లు తెలిపారు. షాద్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్తున్నారని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపుతో మండల, టౌన్, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తరలివస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తుతామని వెల్లడించారు.

'జాల'కు అందని హెచ్‌పీ గ్యాస్.. వినియోగదారుల అవస్థలు

౦ ఏడాదిగా నిలిచిన సరఫరా.. సిలిండర్ కోసం ఐదు కిలోమీటర్ల ప్రయాణం

౦ పట్టించుకోని అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు



తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం జాల గ్రామానికి హెచ్‌పీ గ్యాస్ సరఫరా క్రమం తప్పడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో యాదగిరిగుట్ట గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఈ గ్రామానికి సిలిండర్లు సరఫరా అయ్యేవి. అయితే, జాల గ్రామాన్ని బచ్చన్నపేట మండలం లింగంపల్లి పరిధిలోని గ్యాస్ ఏజెన్సీకి మార్చినప్పటి నుంచి ఈ సమస్య మొదలైంది. ఏడాది కాలంగా గ్రామానికి సక్రమంగా గ్యాస్ సరఫరా కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. సిలిండర్ కోసం గ్రామస్తులు రోజువారీ పనులను మానుకొని సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లినా సిలిండర్ దొరక్క నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని తెలిపారు. పనులు వదులుకోవడమే కాకుండా ప్రయాణ భారం కూడా పడుతోందని పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగానే గ్రామానికి నేరుగా గ్యాస్ సరఫరా చేయాలని, లేదా సమీపంలోనే అందజేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యపై పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఆరుట్ల, మంచాలలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

- తొర్రూర్ పాఠశాలలో సభావేదిక, ఆర్వో ప్లాంట్ ప్రారంభం

తొలివెలుగు, ఇబ్రహీంపట్నం: నాణ్యమైన విద్యతోనే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే తన సోదరి వంగేటి భూదేవమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన సభావేదికను రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అలాగే మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్యారంగ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతలో ఆరుట్లలో, రెండో విడతలో మంచాలలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీల పరిధిలోనూ వీటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యార్థులకు మేలు చేకూరేలా వేదిక, తాగునీటి సదుపాయం కల్పించిన దాతలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

చదువుకు, ఉద్యోగానికి లంకె కుదరడం లేదు: మధుయాష్కి గౌడ్

౦ నైపుణ్య ఆధారిత విద్యతోనే ఉపాధి అవకాశాలు

౦ 10టీవీ కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణలో వెల్లడి

తొలివెలుగు, హైదరాబాద్: ప్రస్తుత విద్యా విధానంలో యువత చదువుతున్న చదువులకు, పొందుతున్న ఉద్యోగాలకు ఎక్కడా సంబంధం ఉండటం లేదని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అభిప్రాయపడ్డారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేలా విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లోని దస్పల్లా హోటల్‌లో 10టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షాపింగ్ టుమారో – వేర్ స్కిల్ మీట్స్ పర్పస్' కాఫీ టేబుల్ బుక్‌ను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణితో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. తగిన ఉద్యోగాలు లేక యువత గిగ్ వర్కర్లుగా స్థిరపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చైనా తరహాలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. దేశ జనాభాకు తగినట్లుగా విద్యాసంస్థలు అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో 10టీవీ సీఓఓ సత్యప్రసాద్, ఇన్‌పుట్ ఎడిటర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం వద్ద శ్రమదానం

౦ పాల్గొన్న సర్పంచ్ పులి రాజు ముదిరాజ్

తొలివెలుగు, రాజాపేట:
పరిసరాల పరిశుభ్రతతోనే విద్యార్థులకు, చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని నెమిల గ్రామ సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ తెలిపారు. రాజాపేట మండలం నెమిల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలింపునకు ప్రజా ఉద్యమం

- మహా పాదయాత్ర ముగింపు సభలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి

తొలివెలుగు, హయత్‌నగర్: జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన మహా పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. డంపింగ్ యార్డ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, స్థానికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమాన్ని వేగవంతం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ నిరంతరం నిలుస్తుందన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బాధితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

౦ అర్హులైన పట్టభద్రులందరికీ అవకాశం కల్పించాలి

౦ కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం

తొలివెలుగు, ఇబ్రహీంపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ 'ఏ' బ్లాక్ నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జరిగిన నమోదు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదుకు మరో వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో గ్రామాలు, పట్టణాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. నమోదులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా శ్రమించాలన్నారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై సర్పంచుల అసహనం

ం రాజాపేట మండల సమీక్షా సమావేశంలో ఎంపీడీవోతో వాగ్వాదం

ం కలెక్టర్ ఆదేశాల మేరకే లబ్ధిదారుల ఎంపిక: ఎంపీడీవో నాగవేణి

తొలివెలుగు, రాజాపేట: ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక విషయంలో తమకు తీవ్ర అవమానం జరుగుతోందని పలువురు సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం రాజాపేటలోని రైతువేదికలో మండల ప్రత్యేక అధికారి దేవ్ సింగ్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘునాథపురం సర్పంచి పల్లె సంతోష్, బొందుగుల సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య మాట్లాడుతూ.. లబ్ధిదారుల జాబితా ఎంపికలో ఎంపీడీవో నాగవేణి పెత్తనం చెలాయిస్తూ, తమను ప్రజల ముందు దోషులుగా నిలబెడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో నాగవేణి స్పందిస్తూ.. పలువురు సర్పంచులు అందుబాటులో లేకపోవడం, సంతకాలు చేసేందుకు నిరాకరించడంతోనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వివరణ ఇచ్చారు. ఎవరినీ కించపరిచే ఆలోచన లేదని, సర్పంచులకు తగిన గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మూడంచల వ్యవస్థలో అత్యవసర పరిస్థితుల్లో ఎంపీడీవో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్ తెలిపారు. అనంతరం దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ఎలినో ప్రభావం, మంచినీటి సరఫరా, పశుపోషణ, వ్యవసాయం తదితర శాఖలపై చర్చించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, తహసీల్దార్ రవికిరణ్, ఏఓ పద్మజ, పర్యవేక్షకులు ఇన్నారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పలువురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు కాగితాలకే పరిమితమా?

ం కొబ్బరికాయల రిబ్బన్లకే పరిమితమైన ప్రారంభోత్సవాలు

ం మిల్లర్లకు అమ్మేసి నష్టపోతున్న రైతన్నలు

ం తక్షణమే కాంటాలు వేయకపోతే ఉద్యమం తప్పదు: పాక వెంకటేష్ యాదవ్

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొబ్బరికాయలు కొట్టి నామమాత్రంగా ప్రారంభించారే తప్ప ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయకపోవడం దారుణమని బీఆర్ఎస్ మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి 15 రోజులైనా అధికారులు కాంటాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో 70 శాతానికి పైగా రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుని నష్టపోతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మిల్లుల కేటాయింపు గానీ, గోనె సంచుల ఏర్పాటు గానీ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా జాప్యాన్ని వీడి తక్షణమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి

ం ఓటు హక్కు ఎంతో విలువైనది: బీజేపీ నేత మొగులయ్య

ం చిట్యాలలో ఓటరు నమోదు డ్రైవ్

తొలివెలుగు, చిట్యాల: అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడూ నవంబర్ 6వ తేదీలోపు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరెకంటి మొగులయ్య కోరారు. చిట్యాల మున్సిపాలిటీలోని 10వ వార్డులో పార్టీ నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, నవంబర్ 6 తుది గడువు కావడంతో ఆఖరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించేలా చొరవ చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీకే వెంకన్న, మున్సిపల్ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, నాయకులు మండల వెంకన్న, మాస శ్రీనివాస్, జయారపు రామకృష్ణ, మర్రి హరీష్ రెడ్డి, గంజి గోవర్ధన్, గోశిక వెంకటేశం, జోగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ భూమిలో అక్రమ నిర్మాణం!

ం సింగారంలో దేవాదాయ స్థలంలో మహిళా సంఘ భవనం

ం ఆలయ భూములను కాపాడాలని కలెక్టర్, అధికారులకు విన్నపం

తొలివెలుగు, రాజాపేట: ఝరాజాపేట మండలం సింగారం గ్రామంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న శివాలయ భూమిలో అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానిక గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి చెందిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా మహిళా సంఘ భవనాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దేవాదాయ భూమిని ఆక్రమణల నుంచి రక్షించి, ఆలయ ఆస్తులను కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాగునీటి కల నెరవేరేలా పనులు వేగవంతం చేయాలి

ం ఉదయ సముద్రం కాల్వ భూసేకరణపై గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్ష

ం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

తొలివెలుగు, చిట్యాల: బ్రహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు కాల్వ భూసేకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందించాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపడుతున్న కాల్వ అలైన్‌మెంట్‌ను శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం నల్గొండలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్వ నిర్మాణం, భూసేకరణ ప్రక్రియ, పనుల ప్రగతి వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ మాట్లాడుతూ.. భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ కాల్వ నిర్మాణంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ భద్రూ, డీఈ విఠల్, ఏఈ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వ సుజాతకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

ం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆలేరు ఆర్యవైశ్యుల విజ్ఞప్తి

ం సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం

తొలివెలుగు, రాజాపేట: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆలేరు నియోజకవర్గ ఆర్యవైశ్యులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు. ఈ మేరకు ఆమెకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరుతూ సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తమ విజ్ఞప్తిని తీసుకెళ్లేందుకు వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు రేపల్లి శ్రీనివాస్, పులిగిల్ల శివనాగేందర్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి, ఆర్యవైశ్య సమాజానికి కల్వ సుజాత అందిస్తున్న సేవలను గుర్తించాలని కోరారు. ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా సమాజానికి తగిన ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి తమ విజ్ఞప్తిని పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.



మంటల్లో కాలిపోయిన కారు.. దంపతులు సురక్షితం

ం బాటసింగారం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం

ం ఏపీ సచివాలయ ఉద్యోగి వాహనంలో అగ్నికీలలు

తొలివెలుగు, హయత్‌నగర్: విజయవాడ జాతీయ రహదారిపై బాటసింగారం సమీపంలో శుక్రవారం ఓ కారు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయానికి కారులో ఉన్న దంపతులు సకాలంలో బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. విజయవాడకు చెందిన తాడేపల్లి ప్రవీణ్ ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా (ఏఎస్ఓ) విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తన భార్యతో కలిసి హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 కారులో విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా బాటసింగారంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రవీణ్ దంపతులు వెంటనే కారు నుంచి కిందకు దిగిపోయారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, క్షణాల్లోనే మంటలు కారు మొత్తానికి వ్యాపించడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. రహదారిపై కారు తగలబడటంతో కాసేపు వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

దళారులను నమ్మి మోసపోవద్దు: పీఏసీఎస్ చైర్మన్ మహేందర్ గౌడ్

ం కుర్రారం, జాలసింగారం, నర్సాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొలివెలుగు, రాజాపేట: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దని రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. శుక్రవారం రాజాపేట మండలంలోని కుర్రారం, జాలసింగారం, నర్సాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పీఏసీఎస్ రేణికుంట–రాజాపేట ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కూతల నాగవేణి, సర్పంచులు బొడ్డు భాస్కర్, ఠాగూర్ లావణ్య ధర్మేందర్ సింగ్, కొండ ప్రమీల పండరి, ఎమ్మా శిరీష నాగరాజు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పీఏసీఎస్ కార్యదర్శి సిల్వేరు శేఖర్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి నిరంతర కృషి

ం తాళ్లవెల్లంల బడిలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్ల పంపిణీ

ం ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ జోగు సురేష్

తొలివెలుగు, చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీ తరఫున తగిన సహకారం అందిస్తామని తాళ్లవెల్లంల గ్రామ సర్పంచ్ జోగు సురేష్ తెలిపారు. చిట్యాల మండలంలోని తాళ్లవెల్లంల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు (యూనిఫాంలు), బూట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. బడిలో మౌలిక వసతుల కల్పనకు ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలుకరాజు అంజనేయులు, ఉపసర్పంచ్ పామనగుళ్ల సునీత బుచ్చిరాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, లింగారెడ్డి, కాలమయ్య, మౌనిక, శివాని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి శనివారం 31 అక్టోబర్ 2026

పంచాయతీ తీర్మానం ఉల్లంఘన: అక్రమ మద్యం విక్రయాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

○ సింగారంలో బెల్ట్ షాపులపై సర్పంచ్, వార్డు సభ్యుల ఆగ్రహం

○ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం సింగారం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల బృందం నేరుగా జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో గ్రామ పంచాయతీ తీర్మానంతో పాటు గ్రామ పెద్దల సమక్షంలో సింగారంలో బెల్టు షాపులను పూర్తిగా మూసివేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. అయితే ఆ నిర్ణయాన్ని బెల్టు షాపు నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోకుండా దొంగచాటుగా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మద్యం విక్రయాలు నిలిపివేయాలని హెచ్చరించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బెల్ట్ షాపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ విషయమై స్థానిక పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిపినప్పటికీ వారు స్పందించకపోవడం గమనార్హం.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతోనే పట్టభద్రుల సమస్యల పరిష్కారం

○ రాజాపేట మండలంలో 680 ఓట్లు నమోదు: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుమలేష్

తొలివెలుగు, రాజాపేట: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ అభ్యర్థిని గెలిపిస్తేనే పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ రాజాపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ తెలిపారు. శుక్రవారం రాజాపేటలో నిర్వహించిన పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు పార్టీ శ్రేణుల సమన్వయంతో 680 గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయించినట్లు తిరుమలేష్ వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జస్వంత్, నాయకులు మాడోత్తు లక్ష్మణ్, మూడవత్ లక్ష్మణ్, శ్రీకాంత్, మాడోత్ రాములు తదితరులు పాల్గొన్నారు.

యక్షగాన కళకు పునర్వైభవం తేవాలి

○ ఆత్మకూరు(ఎం)లో యక్షగాన కళాకారుల నూతన కమిటీ ఎన్నిక

○ కళాకారుల ఐక్యతే లక్ష్యం

○ అంతరించిపోతున్న సంప్రదాయ కళకు జీవం పోసే ప్రయత్నం

○ యువతకు శిక్షణ, గ్రామాల్లో ప్రదర్శనలకు ప్రణాళిక

తొలివెలుగు, ఆత్మకూరు(ఎం): అంతరించిపోతున్న యక్షగాన కళను పరిరక్షించి, భావితరాలకు ఈ సంప్రదాయ కళారూపాన్ని పరిచయం చేయాలనే సంకల్పంతో మండల కేంద్రంలో యక్షగాన కళాకారులు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కళాకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యక్షగానానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గడ్డం స్వామి, ఉపాధ్యక్షుడిగా గడ్డం సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నగేష్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం రాజలింగం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నరేష్, చిరంజీవి, వెంకట్‌రాములు, చక్రపాణి, బిక్షపతి, అమరేందర్, గణేష్, నరేష్, భాను ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గడ్డం స్వామి మాట్లాడుతూ.. రోజురోజుకూ ఆదరణ తగ్గుతున్న యక్షగాన కళకు పూర్వవైభవం తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. కళాకారులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లో యక్షగాన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు, యువతకు శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ సహకారం పొందేందుకు కూడా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విశేష ఆదరణ పొందిన యక్షగాన కళ ఆధునిక వినోద సాధనాల ప్రభావంతో క్రమంగా కనుమరుగవుతోందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదర్శనలకు అవకాశాలు తగ్గడం, తగిన పారితోషికం లభించకపోవడం, కొత్త తరం ఈ కళపై ఆసక్తి చూపకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కళాకారులను ప్రోత్సహించి, సంప్రదాయ కళలను కాపాడినప్పుడే మన సంస్కృతి మూలాలు భావితరాలకు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తిలింగం, యాదగిరి, వెంకటయ్య, సుదర్శనం, వెంకటాద్రి, నాగభూషణం, రాములు, పిల్లుట్ల ముకుందం, పిల్లుట్ల మహేశ్వరం, శ్రీనివాస్, పిల్లుట్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ మార్కండేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

○ స్వర్ణోత్సవాల వేళ ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాలు

○ హాజరైన శ్రీశ్రీ అనుగానంద స్వామీజీ

○ భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : పురపాలక కేంద్రంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవాలయ 50వ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని నూతన రాతి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి గాలిగోపురం, నూతన నవగ్రహ మండపం, నవగ్రహ విగ్రహాలు, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. దత్తాత్రేయ మహాసిద్ధి యంత్ర నవ గురుపాదుక పీఠాధిపతి శ్రీశ్రీ అనుగానంద స్వామీజీ కార్యక్రమానికి హాజరై వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, ఆలయ గాలిగోపురాలపై కలశాల ఏర్పాటు కార్యక్రమాలు చేపట్టారు. శివ పంచాయతన యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేశ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి, శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీతా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి ఇంజమూరి యాదగిరితో పాటు ఆలయ ధర్మకర్తల మండలి, స్వర్ణోత్సవాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జ్వరాల భయం.. ల్యాబ్‌ల దోపిడీ!

○ డెంగ్యూ పేరుతో భారీగా రుసుములు వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదులు

○ అవసరం లేని పరీక్షలతో సామాన్యుల జేబులకు చిల్లులు

○ నిబంధనలు ఉన్నా తనిఖీలు ఏవంటూ ప్రజల ప్రశ్న

○ ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లపై అధికారుల పర్యవేక్షణ కరువు?



తొలివెలుగు, జన్నారం : వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాల తీవ్రత పెరుగుతుండటంతో మంచిర్యాల జిల్లా జన్నారం మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు కనిపించగానే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ భయంతో ప్రైవేటు ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు అవసరానికి మించి పరీక్షలు సూచిస్తూ రోగుల నుంచి అధిక మొత్తంలో రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్వరానికి చికిత్స తీసుకోవాలంటే ముందుగా పరీక్షల పేరుతోనే వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. వ్యాధి నిర్ధారణ పేరుతో ఒక్కో రోగి నుంచి రూ.800కు పైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ పరీక్షకు ఎంత రుసుము వసూలు చేయాలి? ప్రభుత్వం నిర్దేశించిన ధరల వివరాలు అందుబాటులో ఉన్నాయా? రోగులకు తప్పనిసరిగా రశీదులు ఇస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

అవసరానికి మించి పరీక్షలా?

జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ ఖరీదైన పరీక్షలు అవసరమా? వైద్యుల సూచన లేకుండానే పలు పరీక్షలు చేయిస్తున్నారా? ఒకసారి పరీక్షలు చేసిన తర్వాత మళ్లీ మళ్లీ పరీక్షలు చేయాల్సిన అవసరం ఏమిటి? అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. జ్వరం వచ్చిన సమయం, వ్యాధి లక్షణాలు, దశను బట్టి డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు మారుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు అవసరమైన పరీక్షలే సూచిస్తున్నారా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు ఉన్నా.. తనిఖీలు ఏవీ?

తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలు-2022 ప్రకారం ప్రైవేటు వైద్య, రోగ నిర్ధారణ కేంద్రాలు సంబంధిత నమోదు, నిర్దేశిత ప్రమాణాలను పాటించాలి. సేవలు, వసతులు, రుసుముల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలి. అయితే జన్నారం మండలంలోని ప్రైవేటు ల్యాబ్‌లలో ఈ నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్రాల నమోదు, సిబ్బంది అర్హతలు, పరీక్షల నాణ్యత, రుసుముల వివరాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ప్లేట్‌లెట్ల పేరుతో భయాందోళనలు?

ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిందని చెప్పి రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్లేట్‌లెట్ల సంఖ్య ఒక్కటే డెంగ్యూ నిర్ధారణకు ప్రామాణికం కాదని వైద్య మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. రోగి లక్షణాలు, వ్యాధి దశ, ఇతర పరీక్షల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని వైద్యులు చికిత్స నిర్ణయించాలి. ఈ విషయంలో రోగులకు సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంది.

అధికారులు స్పందించేనా?

జన్నారం మండలంలోని ప్రైవేటు ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్రాల నమోదు, సిబ్బంది అర్హతలు, పరీక్షల నాణ్యత, వసూలు చేస్తున్న రుసుములు, రోగులకు అందిస్తున్న బిల్లులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జ్వరంతో ఆసుపత్రులకు వచ్చే సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు అనవసర ఖర్చుల భారం పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆరోగ్య సమస్యలను ఆసరాగా చేసుకుని ఎవరైనా అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాయుసేన కొత్త వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ ఐఎస్ వాలియా

నవంబర్ 1 నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్న ఐఎస్ వాలియా

ప్రస్తుత వైస్ చీఫ్ అశుతోష్ దీక్షిత్‌కు ఎయిర్ చీఫ్‌గా పదోన్నతి

ఫైటర్ పైలట్‌గా వాలియాకు 3,200 గంటలకు పైగా అనుభవం

ప్రస్తుతం ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా వాలియా సేవలు

భారత వాయుసేన ఉన్నతస్థాయి నాయకత్వంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. వాయుసేన తదుపరి వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా ఎయిర్ మార్షల్ ఇందర్‌పాల్ సింగ్ వాలియా (ఐ.ఎస్. వాలియా) నియమితులయ్యారు. నవంబర్ 1వ తేదీ నుంచి ఆయన ఈ నూతన బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రస్తుత వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, వాయుసేన 29వ అధిపతిగా (చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) పదోన్నతి పొందనున్నారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ 42 ఏళ్ల సుదీర్ఘ సేవ అనంతరం అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనుండటంతో ఈ నియామకాలు జరిగాయి. దీక్షిత్ స్థానంలో వాలియా వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎయిర్ మార్షల్ వాలియా ప్రస్తుతం ఈస్టర్న్ ఎయిర్ కమాండ్‌కు ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన, 1988లో ఫైటర్ స్ట్రీమ్‌లో కమిషన్ అయ్యారు. ఫైటర్ పైలట్‌గా 3,200 గంటలకు పైగా విమానాలను నడిపిన అపార అనుభవం ఆయన సొంతం. తన వృత్తిగత ప్రస్థానంలో మిగ్-21, మిగ్-27, జాగ్వార్, సుఖోయ్-30 ఎంకేఐ వంటి పలు రకాల యుద్ధ విమానాలను ఆయన నడిపారు. తన కెరీర్‌లో కీలకమైన మిగ్-27 స్క్వాడ్రన్‌కు, బరేలీ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే జపాన్, దక్షిణ కొరియాలలో డిఫెన్స్ అటాషెగా కూడా సేవలందించారు. విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయన 2008లో 'వాయు సేన మెడల్', 2018లో 'అతి విశిష్ట సేవా మెడల్' అందుకున్నారు.

సౌదీ అరేబియాకు విమానాలు రద్దు చేసిన ఎయిర్ ఇండియా

భద్రతా కారణాలతో నవంబర్ 14 వరకు సర్వీసులు నిలుపుదల

జెడ్డా, రియాద్, దమ్మామ్‌కు వెళ్లే విమానాలపై ప్రభావం

ప్రయాణికులకు టికెట్ రీఫండ్ లేదా రీబుకింగ్ అవకాశం

సౌదీ విమానాశ్రయాలపై దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం

ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు సౌదీ అరేబియాకు తమ విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. సౌదీలోని జెడ్డా, రియాద్, దమ్మామ్ నగరాలకు వెళ్లే, అక్కడి నుంచి బయల్దేరే అన్ని విమానాలను నవంబర్ 14 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థలు పేర్కొన్నాయి. ఈ నిర్ణయంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు విమానయాన సంస్థలు రెండు ప్రత్యామ్నాయాలను సూచించాయి. నవంబర్ 14 వరకు ప్రయాణించేందుకు అక్టోబర్ 30 లేదా అంతకంటే ముందు టికెట్లు బుక్ చేసుకున్న వారు, ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా తమ ప్రయాణ తేదీని ఒకసారి మార్చుకోవచ్చు. లేదా టికెట్ రద్దు చేసుకుని పూర్తి నగదు వాపసు (రీఫండ్) పొందవచ్చు. తేదీ మార్చుకోవాలనుకునే వారు నవంబర్ 29 లోపు ప్రయాణించేలా టికెట్లు రీబుక్ చేసుకోవచ్చని, అయితే ఇది సీట్ల లభ్యతపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశాయి. ఇటీవల సౌదీ అరేబియాలోని పౌర సదుపాయాలపై, ముఖ్యంగా రియాద్, దమ్మామ్ విమానాశ్రయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దమ్మామ్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒక భారతీయుడు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సౌదీలో చిక్కుకుపోయిన భారతీయ యాత్రికులను, ముఖ్యంగా ఉమ్రా యాత్రికులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే వందలాది మంది ఉమ్రా యాత్రికులు భారత్‌కు చేరుకున్నట్లు సమాచారం.

ఎయిర్‌లైన్స్‌కు చమురు కష్టాలు..

పెరుగుతున్న ఏటీఎఫ్ ధరలతో నష్టాల బెడద

స్టాక్ మార్కెట్లలో కంపెనీల షేర్లు విలవిల

న్యూఢిల్లీ: భారతీయ విమానయాన పరిశ్రమకు మళ్లీ చమురు కష్టాలు వచ్చిపడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మరోమారు ఉద్రిక్తతలు తలెత్తడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం దేశీయ మార్కెట్‌లో విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు పెరిగాయి. లీటర్ రూ.6.28 ఎగబాకింది. ఆగస్టులోనూ ఒకసారి లీటర్ రూ.5 పెరిగిన విషయం తెలిసిందే. అయితే పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ముదిరితే ధరలు ఇంకా పెరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఇది ఏవియేషన్ ఇండస్ట్రీని కలవరపెడుతున్నదిప్పుడు. పెరుగుతున్న చమురు ధరలు.. ఎయిర్‌లైన్స్ నిర్వహణ ఖర్చులను ఎగదోసేలా ఉన్నాయి. సంస్థాగత నిర్వహణ వ్యయాల్లో ఏటీఎఫ్ వాటానే 35-40 శాతంగా ఉంటుంది మరి. ఈ నేపథ్యంలో అధిక చమురు ధరలు.. ఎయిర్‌లైన్స్ నష్టాలకు దారితీసే ప్రమాదం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో టికెట్ ధరలు పెరిగే అవకాశాలూ లేకపోలేదు. ఇదే జరిగితే ప్రయాణికులపై అదనపు భారం తప్పదని చెప్పవచ్చు. అయితే మార్కెట్‌లో పోటీ దృష్ట్యా కొన్ని ఎయిర్‌లైన్స్.. అధిక చమురు ధరల భారాన్ని ప్రయాణికులపై మోపకుండా భరించే యోచనలో ఉన్నట్టు కూడా తెలుస్తున్నది. దీనివల్ల ఆయా సంస్థల లాభాలు తగ్గిపోవడమో, నష్టాలు వాటిల్లడమో జరుగుతుందని.. ఇది ఇండస్ట్రీకి అంత మంచి పరిణామం కాదని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న మొదలైన మిడిల్ ఈస్ట్ యుద్ధం.. 6 నెలలు దాటినా ఆగట్లేదు. దీంతో భారత్ సహా చమురు దిగుమతులపై ఆధారపడ్డ చాలా దేశాలకు ఈ వార్ ఇబ్బందికరంగా మారింది. దేశీయ ఇంధన అవసరాలు సుమారు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న సంగతి విదితమే. ఇందులో గల్ఫ్ దేశాల నుంచి హొర్ముజ్ జలసంధి మీదుగా వస్తున్నది ఎక్కువే. ఇరాన్ హొర్ముజ్‌లో రవాణాకు ఆటంకాలు ఏర్పరుస్తుండటంతో భారత్‌కు డిమాండ్‌కు తగ్గ ముడి చమురు రాలేకపోతున్నది. ఫలితంగా దేశంలో ధరలు పెరుగుతున్నాయి. ఇక 15 రోజులకోసారి (ప్రతి నెలా 1, 15 తేదీల్లో) పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్, వంట గ్యాస్ సహా అన్ని ఇంధనాల ధరలను అంతర్జాతీయ ముడి చమురు ధరల ఆధారంగా దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు సవరిస్తున్నది తెలిసిందే. ఇలా గడిచిన 2 నెలల్లో ఏటీఎఫ్ ధర లీటర్ రూ.11.28 పెరిగింది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ రేటు 91 డాలర్లపైనే పలుకుతున్నది. గతంలో 125 డాలర్లుగా నమోదైన సంగతి విదితమే పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లలో ఎయిర్‌లైన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. గురువారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో ఇండిగో షేర్ విలువ రూ.41 పడిపోయి రూ.4,979 వద్ద స్థిరపడింది. స్పైస్‌జెట్ షేర్ కూడా ఒడిదుడుకుల్లో కదలాడుతున్నది. ఒకవేళ పెరిగినా స్వల్ప లాభాలకే పరిమితమవుతున్నది. ఇదిలావుంటే కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలపైనా చమురు ధరల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో ఇండిగో రూ.238 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. స్పైస్‌జెట్ సోమవారం ప్రకటించనున్నది. నిజానికి ఇప్పటికే ఆయా విమానయాన సంస్థలు అధిక ఇంధన ధరల భారాన్ని మోయలేక సతమతమవుతున్నాయి. టికెట్ ధరల పెంపుతో ప్రయాణికులపై కొంత భారం మోపినా.. పోటీ కారణంగా మిగతా భారాన్ని దిగమింగక తప్పట్లేదని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే గిరాకీ లేని రూట్లలో సేవలు నిలిపివేస్తున్నాయని, కొత్త రూట్లను ప్రకటించడం లేదని అంటున్నారు. ఇక ఉద్రిక్తతలు, యుద్ధాల కారణంగా పాకిస్థాన్, మిడిల్ ఈస్ట్, ఉక్రెయిన్-రష్యా దేశాల గగన తలాల వినియోగంపై ఆంక్షలుంటున్నాయని, దీంతో ప్రయాణ దూరం పెరుగుతున్నదని ఎయిర్‌లైన్స్ వాపోతున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయంలో లాభాల వాటా బాగా తగ్గిపోతున్నదని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. మొత్తానికి ప్రస్తుత పరిస్థితులు భారతీయ విమానయాన రంగాన్ని కుదేలు చేస్తున్నాయని చెప్పకతప్పదు. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న నేపథ్యంలో విమానయాన ఇండస్ట్రీ కోసం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద ధర స్థిరీకరణ పథకాన్ని పరిచయం చేసింది. ఈ స్కీమ్‌లో చేరిన ఎయిర్‌లైన్స్‌కు మూడేండ్లపాటు గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలతో సంబంధం లేకుండా (పెరిగినా, తగ్గినా) లీటర్ రూ.115కే దొరుకుతుంది. పథకంలో చేరని ఎయిర్‌లైన్స్ ఎప్పట్లాగే మార్కెట్ రేట్లకు కొనుగోలు చేయవచ్చు. అయితే ధరలు పెరిగితే భారం పడుతుంది. కానీ తగ్గితే లాభదాయకం. ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య చర్చల నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. అప్పుడు సదరు పథకంలో చేరని ఎయిర్‌లైన్స్‌కు తక్కువ ధరకే ఇంధనం లభించింది. కానీ ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం లీటర్ రూ.110గా ఉన్నది. గల్ఫ్ పరిస్థితులనుబట్టి ఇంకా పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఫలితంగా అధిక ధరలతో ఎయిర్‌లైన్స్‌కు నష్టాలు తప్పేలా లేవు. ఏదేఏమైనా పథకంలో చేరిన ఎయిర్‌లైన్స్‌కు ఒక రకంగా, చేరని కంపెనీలకు మరొక రకంగా నష్టాలే మిగులుతున్నాయని ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ మాట.

భారత కంపెనీలపై కెన్యా 'సఫారీ'!

కెన్యాలోని కజియాడో కౌంటీలోని మగాడి సరస్సు వద్ద టాటా కెమికల్స్ మగాదీ లిమిటెడ్(టీసీఎంఎల్) సోడా యాష్ గనులను నిర్వహిస్తోంది. శతాబ్దంపైగా చరిత్ర గల ఈ గనులను 2005లో బ్రిటన్‌కు చెందిన బర్నర్ మాండ్ నుంచి కొనుగోలు చేయడం ద్వారా టాటా కెమికల్స్ కెన్యాలోకి అడుగుపెట్టింది. 100 ఏళ్ల మైనింగ్ హక్కులను దక్కించుకుంది. ఇక్కడ ఉత్పత్తి చేసే సోడా యాష్‌ను గ్లాస్, డిటర్జెంట్లతో సహా రకరకాల పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తుంటారు. ఈ ఖనిజం విదేశాలకూ భారీగా ఎగుమతవుతోంది. అయితే, ఈ ఏడాది జూలై 28న మైనింగ్ క్యాబినెట్ సెక్రటరీ హాసన్ జోహో టీసీఎంఎల్ మైనింగ్ కార్యకలాపాలను సస్పెండ్ చేయడంతో గొడవ మొదలైంది. మైనింగ్ లైసెన్సులతో పాటు ఇతరత్రా నిబంధనలను ఉల్లంఘించిందనేది గనుల శాఖ ఆరోపణ. అంతేకాదు, రాయల్టీలు, ఖనిజ శుద్ధి, ఎగుమతుల రిపోర్టింగ్, కమ్యూనిటీ అభివృద్ధికి సంబంధించి కూడా పలు ప్రశ్నలను లేవనెత్తింది. ముఖ్యంగా టాటా కెమికల్స్ ఇక్కడ గనుల నుంచి వెలికితీస్తున్న ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసేందుకు తగినన్ని ఫ్యాక్టరీలను పెట్టకుండా, ఎగుమతి చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అయితే, మైనింగ్ శాఖ సస్పెన్షన్ ఆదేశాలపై కెన్యా హైకోర్టులో సవాలు చేసినా టాటాలకు ఊరటదక్కలేదు.

రూటో అల్టిమేటం..

కెన్యా అధ్యక్షుడు విలియం రూటో టాటా కెమికల్స్ తమ దేశాన్ని విడిచిపోవాలంటూ అల్టిమేటం జారీ చేయడంతో వివాదం మరింత ముదిరింది. టాటా దశాబ్దాలుగా తమ దేశంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పటికీ.. తగినన్ని ఫ్యాక్టరీలను నెలకొల్పలేదని, స్థానికంగా ఎలాంటి పారిశ్రామిక ప్రగతీ లేదని రూటో విరుచుకుపడ్డారు. ప్రజలకు టాటా కెమికల్స్ వల్ల పైసా ప్రయోజనం లేదని, అందుకే ఈ ప్రాంతంలో గ్లాస్, కెమికల్ తయారీ ఫ్యాకర్టీల కోసం ప్రభుత్వం రెండు కంపెనీలను నెలకొల్పుతుందన్నారు. టాటాల వ్యాపారాన్ని ఆ కంపెనీలు టేకోవర్ చేస్తాయని ప్రకటించారు. గతంలో కూడా ఇక్కడ టాటాలతో గొడవ నడిచింది. భూమి ధరలు, రాయల్టీలకు సంబంధించి తమకు 17.4 బిలియన్ కెన్యన్ షిల్లింగ్గను చెల్లించాలంటూ కిజియాడో కౌంటీ కోర్టుకెక్కింది. అయితే, దీనిపై టాటాలకు అనుకూలంగా తీర్పురావడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడే టాటాలను దేశం నుంచి వెళ్లగొట్టే చర్యలకు తెరతీయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో సంబంధిత ప్రభుత్వ యంత్రాంగాలు, కోర్టులే టాటా కెమికల్స్ కెన్యా వ్యాపార భవిష్యత్తును తేల్చాల్సిన పరిస్థితి నెలకొంది. మగాడి గనుల సస్పెన్షన్ ఆదేశాల నేపథ్యంలో కెన్యా గనుల శాఖ కోరిన సమాచారం, డాక్యుమెంట్లు, రిపోర్టులు అన్నీ ఇప్పటికే సమర్పించామని టాటా కెమికల్స్ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం నుంచి తదుపరి ఆదేశాల కోసం వేచిచూస్తున్నట్లు తెలిపింది. వివాదాస్పద అంశాల పరిష్కారం కోసం న్యాయపరంగా, నియంత్రణపరంగా కెన్యా ప్రభుత్వంతో కలిసి తగిన చర్యలు చేపట్టడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. తమ ఉద్యోగులు, మగాదీ ప్రజల శ్రేయస్సుతో పాటు కెన్యా ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత కొనసాగుతుందని కూడా స్పష్టం చేసింది. అదానీ: నైరోబీ జోమో కెన్యాటా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (జేకేఐఏ) ఆధునీకరణ ప్రాజెక్టును (1.85 బిలియన్ డాలర్లు) 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ 2024లో దక్కించుకుంది. వ్యూహాత్మక జాతీయ ఆస్తులను విదేశీ కంపెనీలకు కట్టబెడితే ఉద్యోగాలు పోతాయంటూ కెన్యాలోని విమానయాన యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించాయి. మరోపక్క, అదానీ ఎనర్జీ, కెన్యా ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీతో 30 ఏళ్ల పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు విలువ 736 మిలియన్ డాలర్లు. అమెరికాలో గౌతమ్ అదానీపై లంచాల కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రూటో ఈ రెండు అదానీ ప్రాజెక్టులను రద్దు చేశారు. అయితే, ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు రద్దు వెనుక చైనా హస్తంపై అనుమానాలున్నాయి. ఎందుకంటే 1.2 బిలియన్ డాలర్లతో చైనా రోడ్ అండ్ బ్రిడ్స్ కార్పొరేషన్ జేకేఐఏ విస్తరణకు ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఎస్సార్: 2008లో ఎస్సార్ తన యూమొబైల్ టెలికం వ్యాపారాన్ని కెన్యాలో ప్రారంభించింది. 40 బిలియన్ కెన్యన్ షిల్లింగ్స్ పెట్టుబడులు పెట్టింది. అయితే, నష్టాల కారణంగా 2014లో దీన్ని ఎయిర్‌టెల్, సఫరీకామ్‌లకు విక్రయించింది. ఇక కెన్యా పెట్రోలియం రిఫైనరీస్‌లో 50 శాతం వాటాను ఎస్సార్ ఎనర్జీ 2016లో కెన్యా ప్రభుత్వానికి 5 మిలియన్ డాలర్లకు వదిలేసి వైదొలగింది. కెన్యా ప్రభుత్వ ప్రతికూల పాలసీలే దీనికి కారణమనేది ఎస్సార్ ఆరోపణ.

TGTEL/26/A6221
తొలివెలుగు
యాదాద్రి భువనగిరి శనివారం 31 అక్టోబర్ 2026

స్విగ్గీపై కస్టమర్ రివేంజ్

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ సేవలపై వినియోగదారుల అసంతృప్తి మరోసారి తీవ్ర స్థాయికి చేరింది. గతంలో ఆర్డర్ చేసిన ఆహారం సుమారు రెండు గంటలు ఆలస్యంగా డెలివరీ కావడంతోపాటు కస్టమర్ కేర్ నుంచి సరైన స్పందన లభించకపోవడంతో ఆగ్రహానికి గురైన ఓ వినియోగదారుడు, ప్లాట్‌ఫామ్‌పై వినూత్న రీతిలో రివేంజ్ తీర్చుకున్న ఉదంతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు కస్టమర్ తెలిపిన వివరాల ప్రకారం.. రూ.500 విలువైన మునుపటి ఆర్డర్ గంటల తరబడి ఆలస్యమైనప్పటికీ ఆర్డర్ రద్దుకు యాప్ యాజమాన్యం నిరాకరించింది. పైగా బాధ్యతనంతా వినియోగదారుడిపైనే నెడుతూ వంద శాతం క్యాన్సిలేషన్ ఛార్జీలు విధిస్తామని తెలిపింది. ఆటోమేటెడ్ చాట్‌బాట్‌లు, సరిగా స్పందించని కస్టమర్ సపోర్ట్ కారణంగా మానసిక క్షోభకు గురైన సదరు వ్యక్తి మరుసటి రోజు రూ.1,400 విలువైన క్యాష్ ఆన్ డెలివరీ ఆర్డర్‌ను ఉంచాడు. డెలివరీ ఏజెంట్ రాగానే దాన్ని నిరాకరించి రద్దు చేయడం ద్వారా తన నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన క్విక్ కామర్స్, ఫుడ్ టెక్ రంగంలో పడిపోతున్న సేవా ప్రమాణాలను, కస్టమర్ కేర్ వ్యవస్థలలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ఒకవైపు వినియోగదారులు సంస్థల బాధ్యతారాహిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తుండగా, మరోవైపు ఈ తరహా ప్రతీకార చర్యల వల్ల స్థానిక రెస్టారెంట్లు, అల్పదాయక డెలివరీ భాగస్వాములే ఆర్థికంగా దెబ్బతింటారని రంగానికి చెందిన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల హక్కులను కాపాడటంతో పాటు సంస్థల జవాబుదారీతనాన్ని నిర్దేశించే కఠిన నిబంధనలు తక్షణ అవసరమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ఎస్బీఐ బీఎస్‌బీడీ ఖాతాదారులకు షాక్

అక్టోబర్ 1 నుంచి నగదు ఉపసంహరణలపై చార్జీలు

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాదారుల నగదు ఉపసంహరణ చార్జీలను సవరించబోతున్నది. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పుల ప్రకారం.. ఖాతాదారులు మొత్తంగా నెలకు నాలుగు నగదు ఉపసంహరణలనే ఉచితంగా పొందగలరు. ఆపై ప్రతి నగదు ఉపసంహరణకూ రూ.15 చొప్పున (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. కాగా, బీఎస్‌బీడీ ఖాతాదారులు తమ ఖాతాల్లో ఎటువంటి కనీస నగదు నిల్వలను ఉంచనక్కర్లేదన్న విషయం తెలిసిందే. డిపాజిట్లు, ఉపసంహరణలు సహా కనీస బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ బీఎస్‌బీడీ ఖాతాలను బ్యాంకులు అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే రెగ్యులర్ సేవింగ్స్ అకౌంట్‌కు వీటికి సేవలు, లావాదేవీలు పరిమితుల్లో తేడాలుంటాయి.

ఆర్థిక వృద్ధిలో రంగారెడ్డి జోరు..

దేశంలోని కీలక ప్రాంతాల జాబితాలో చోటు

వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో రంగారెడ్డికి చోటు

జైపూర్, నాసిక్, సూరత్‌తో పాటు రంగారెడ్డి ప్రస్తావన

దేశంలో ఆర్థికంగా కీలక మెట్రోగా పుణెకు అగ్రస్థానం

మెట్రో నగరాల్లో వృద్ధి వేగంలో కోల్‌కతా ముందంజ

అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సౌత్ 24 పరగణాస్ టాప్

దేశంలో ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చోటు దక్కింది. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్‌తో పాటు రంగారెడ్డి తన ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నట్లు 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్' తాజా నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి ఇక సంప్రదాయ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోందని తెలిపింది.

'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ సిటీ వైటాలిటీ ఇండెక్స్' ప్రకారం దేశంలో అత్యంత ఆర్థికంగా కీలకమైన మెట్రో నగరంగా పుణె నిలిచింది. ఐటీ సేవలు, అధునాతన తయారీ, ఆటోమొబైల్, విద్య, ఆవిష్కరణ ఆధారిత కార్యకలాపాలు పుణెకు కలిసొచ్చాయి. అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో నగరాల్లో ఆర్థిక వృద్ధి వేగం విషయంలో కోల్‌కతా ముందుంది. ఏప్రిల్-జూన్ 2026 కాలానికి రూపొందించిన సూచీలో దేశవ్యాప్తంగా 800కుపైగా జిల్లాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత భౌగోళిక పరిశీలన డేటాతో పాటు ఆర్థిక సూచీలను ఇందుకు ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సౌత్ 24 పరగణాస్ అగ్రస్థానంలో నిలిచింది. నార్త్ 24 పరగణాస్, థానే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్, రంగారెడ్డి ప్రాంతాలు కూడా తమ ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. గత దశాబ్దంలో దిమాపూర్, పంచమహల్స్, ఆనంద్, అయోధ్య, రాంపుర్, బస్తీ, షామ్లీ, బౌధ్, ఔరంగాబాద్, కోడెర్మా వంటి జిల్లాలు స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేశాయి. దేశంలో పట్టణీకరణ మరింత విస్తృతంగా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పెట్టుబడులు, వ్యాపారాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు, మౌలిక వసతులు కొత్త నగరాల వైపు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. భవిష్యత్ పెట్టుబడులకు ఈ కొత్త వృద్ధి మార్గాలు కీలకంగా మారనున్నాయని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది.

భారత 'శాంతి' నిబంధనలపై త్వరలో యూఎస్ స్పందన

భారత పౌర అణు విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరుస్తూ కేంద్ర అణుశక్తి శాఖ (డీఏఈ) ఇటీవల విడుదల చేసిన చారిత్రాత్మక 'శాంతి' చట్టం ముసాయిదా నిబంధనలపై అమెరికా అణు పారిశ్రామిక రంగాలు సమగ్ర సమర్పణలు (ఫైనల్ సబ్మిషన్స్) చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అమెరికా-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ నేతృత్వంలో అమెరికాలోని న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఐ), ప్రముఖ న్యాయ నిపుణులు, పారిశ్రామిక దిగ్గజాలు కలిసి భారత ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను అందించేందుకు కసరత్తు పూర్తి చేస్తున్నాయి. సెప్టెంబర్ 4వ తేదీ నాటికి డీఏఈకి సమర్పించాల్సిన ఈ స్పందనల కోసం యూఎస్ఐఎస్‌పీఎఫ్ ఇటీవల ఒక ఉన్నత స్థాయి వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది. భారత పౌర అణు రంగంలో లైసెన్సింగ్ ప్రక్రియ, పరిమితులు, ఇన్సూరెన్స్ ఫ్రేమ్‌వర్క్, ప్రైవేట్ పెట్టుబడుల భద్రత, ప్రాజెక్ట్ నిర్మాణం వంటి కీలక అంశాలపై అమెరికా కంపెనీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

లస్సీ విక్రేత సక్సెస్ స్టోరీ

తన జీవిత పోరాటాన్ని వెల్లడించిన ఢిల్లీ లస్సీ విక్రేత

11 ఏళ్ల వయసులోనే కుటుంబం కోసం పనిలోకి

చిన్నతనంలో తండ్రిని కోల్పోయిన దుస్థితి

గతంలో రోజుకు రూ.250 వరకు సంపాదించినట్లు వెల్లడి

ప్రస్తుతం నెలకు రూ.90 వేల వరకు సంపాదన

సొంత ఇల్లు.. చాలామందికి అది ఓ సాధారణ కల. కానీ ఢిల్లీకి చెందిన ఓ లస్సీ విక్రేతకు మాత్రం అది జీవితాంతం వెంటాడిన కోరిక. చిన్నతనంలో తండ్రిని కోల్పోయాడు. ఉండేందుకు సొంత ఇల్లు కూడా లేదు. 11 ఏళ్ల వయసులోనే కుటుంబ బాధ్యతలు భుజాన వేసుకున్నాడు. ఇప్పుడు అదే వ్యక్తి కష్టపడి తన కుటుంబానికి సొంతింటిని నిర్మించుకున్నాడు.

11 ఏళ్ల నుంచే పనికి

డిజిటల్ క్రియేటర్ ఉపేన్ వర్మతో జరిగిన ఇంటర్వ్యూలో లస్సీ విక్రేత తన జీవిత కథను పంచుకున్నాడు. దేవుడిని ఒక కోరిక కోరుకునే అవకాశం వస్తే ఏం అడుగుతావని వర్మ ప్రశ్నించాడు. అందుకు అతడు 'నా తండ్రి జీవితం' అని సమాధానం ఇచ్చాడు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయినట్లు చెప్పాడు. ఆ సమయంలో తమకు ఉండేందుకు ఇల్లు కూడా లేదని గుర్తుచేసుకున్నాడు. 11 ఏళ్ల వయసు నుంచే కష్టపడుతున్నానని తెలిపాడు. కుటుంబాన్ని ఆదుకునేందుకు అప్పుడే పనిలోకి దిగాల్సి వచ్చిందన్నాడు.

కుటుంబం కోసం పోరాటం

ఏళ్ల తరబడి కష్టపడుతూ తన కుటుంబానికి అండగా నిలిచాడు. తోబుట్టువుల వివాహాలు చేశాడు. తర్వాత తనకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అయితే సొంతింటి కల మాత్రం అతడిని వెంటాడుతూనే ఉంది.

రూ.250 నుంచి రూ.90 వేల వరకు

తండ్రి జీవించి ఉన్న సమయంలో రోజుకు సుమారు రూ.250 సంపాదించేవాడినని అతడు చెప్పాడు. ప్రస్తుతం ఢిల్లీలో లస్సీ విక్రయిస్తూ నెలకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు సంపాదిస్తున్నట్లు తెలిపాడు. ఆ ఆదాయంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో తన కుటుంబం కోసం సొంతింటిని నిర్మించుకున్నాడు.

దేశంలో పెరిగిపోతున్న చక్కెర ధరలు..

దేశంలో చక్కెర ధరలు పెరిగిపోతున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ధరలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల పెరుగుదలను అరికట్టాలంటే దిగుమతులు ఒక్కటే మార్గమని నమ్ముతోంది. ఇందుకోసం ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెర దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది.

మిలియన్ టన్నుల చక్కెర దిగుమతికి ప్లాన్



అది కూడా ఎలాంటి సుంకాలు లేకుండా. దేశంలో చక్కెర సరఫరా పడిపోవడం, దిగుమతుల మీద ఈ స్థాయిలో ఆధారపడటం పదేళ్లలో ఇదే మొదటిసారి. ప్రస్తుతం దేశంలో చక్కెర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత మార్చి నుంచి నెమ్మదిగా పెరుగుతూ వస్తున్నాయి. చక్కెర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న మహారాష్ట్రలోని మిల్లుల్లోనే క్వింటాల్ చక్కెర ధర రూ.5,400-రూ.5,560 పలుకుతోంది. ప్రస్తుతం దేశంలో ఫెస్టివల్ సీజన్ ప్రారంభం కానుంది. దీంతో చక్కెరకు డిమాండ్ ఇంకా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. మార్కెట్ వర్గాల ప్రకారం దేశంలో షుగర్ సీజన్ ప్రతి ఏడాది అక్టోబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. 2025-2026 సీజన్‌లో అంచనాలకు మించి దేశంలో చక్కెర వినియోగం పెరిగిపోయింది. ఉత్పత్తి అంచనాల్లో జరిగిన పొరపాట్ల వల్ల కేంద్రం గతంలో 1.5-2.0 మిలియన్ టన్నుల చక్కెర దిగుమతికి కేంద్రం అనుమతించింది. గత ఏడాది నవంబర్‌లో చక్కెర ఎగుమతులు చేసేందుకు అనుమతించింది. ఆ తర్వాత కేంద్రం పరిస్థితిని గమనించి చక్కెర ఎగుమతులపై నిషేధం విధించింది. అయితే, ఆలోపే 0.8 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతి అయింది. అంటే, ఇప్పుడు ఇండియా దిగుమతి చేసుకోవాలనుకుంటున్న ముడి చమురుకు ఇది కాస్త తక్కువ. మనం ఎంత ఎగుమతి చేశామో.. అంతే దిగుమతి చేసుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇది చక్కెర తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించిన కొందరు వ్యక్తులు చేసిన పొరపాటు వల్లే అని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఇండియా చివరగా 2016-17 సీజన్‌లో చివరగా ముడి చక్కెర దిగుమతికి అనుమతించింది. ఇప్పుడు మళ్లీ దాదాపు పదేళ్ల తర్వాత ఈ స్థాయిలో దిగుమతులకు సిద్ధమవుతోంది.

కీలక రంగాల్లో వృద్ధి

న్యూఢిల్లీ: గత కొన్ని నెలలుగా నిస్తేజంగా కొనసాగిన కీలక రంగాలు మళ్లీ వృద్ధి బాటపట్టాయి. బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్, ఖనిజ విభాగాలు మెరుగైన పనితీరు కనబర్చడంతో గత నెలకుగాను తొమ్మిది కీలక రంగాలు 5.4 శాతం వృద్ధిని సాధించాయి. కానీ, జూన్ నెలలో నమోదైన 6 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 3 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. గతంలో ఎనిమిదిగా ఉన్న కీలక రంగాలు ఇటీవల కొత్తగా ఇనుప ఖనిజం జతపరిచింది. అలాగే క్రూడాయిల్, సహజ వాయువు, ఎరువులు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఏప్రిల్-జూలై నెలకుగాను కీలక రంగాలు 4.3 శాతం వృద్ధిని కనబరిచాయి.

గంజాయి కేసులు పెడతామని ఎస్సైలు బెదిరిస్తున్నారు: పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని అరాచకాలకు పాల్పడుతోందని, పోలీసులు తమ యూనిఫాంల కింద పచ్చ చొక్కాలు ధరించి టీడీపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మాచర్లలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... వైసీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని పిన్నెల్లి ఆరోపించారు. టీడీపీ గూండాలు దాడులు చేస్తుంటే అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. "మాచర్ల మున్సిపాలిటీలో ఒక కౌన్సిలర్ అభ్యర్థిపై టీడీపీ గూండాలు రక్తం వచ్చేలా దాడి చేశారు. బీఫామ్ సమర్పించడానికి వెళ్లినప్పుడు ఓ గంజాయి బ్యాచ్ దాడి చేసి పత్రాలు చించివేసింది" అని ఆయన వివరించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై 33 కేసులు నమోదు చేశారని, కానీ దాడులు చేసిన వారిని వదిలేశారని పిన్నెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, దీనిపై ఆధారాలతో ఎస్ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, నాగార్జున సాగర్ ఎస్సైలు టీడీపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ, పోటీ నుంచి తప్పుకోకపోతే గంజాయి కేసులు పెడతామని అభ్యర్థులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో మాచర్లలో 5,400 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, రింగ్ రోడ్డు నిర్మించామని, ఆసుపత్రిని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, బెయిల్ రద్దు చేస్తామని బెదిరించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక సిట్ ఏర్పాటు చేసి, ఈ అరాచకాలకు పాల్పడిన వారిని శిక్షిస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు ఫ్యాక్షనిజాన్ని రెచ్చగొడుతున్నారు: వైఎస్ అవినాశ్ రెడ్డి

వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత మూడేళ్లలో ఏం అభివృద్ధి పనులు చేశారని ప్రజలను ఓట్లు అడుగుతారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈరోజు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. పులివెందులలో వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా పోలీసులు అడ్డుకున్నారని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నామినేషన్లు వేయొచ్చని చెప్పి, ఆ తర్వాత మున్సిపల్ కార్యాలయం బయటే తమ వారిని నిలిపివేశారని, అనుమతి ఇవ్వబోమని స్పష్టంగా చెప్పారని ఆయన వివరించారు. ప్రశాంతంగా ప్రచారం కూడా చేసుకోనివ్వడం లేదని, ప్రచారంలో పాల్గొన్న వారి ఆస్తులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బయటి నుంచి పెద్ద సంఖ్యలో జనాలను తరలించి, ఏజెంట్లను, ఓటర్లను అడ్డుకుని దొంగ ఓట్లు వేయడానికి కుట్ర పన్నుతున్నారని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. ఈ కుట్రకు డీఐజీ కోయ ప్రవీణ్ టీడీపీకి పూర్తిగా సహకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. పులివెందులకు మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనైనా చేశారా? అని నిలదీశారు. చంద్రబాబు ఫ్యాక్షనిజాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. టీడీపీ కుట్రలను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. "చంద్రబాబు గారూ... మీరు చేస్తున్న ఈ తప్పుడు పనులు చాలా దూరం వెళ్తాయి" అని ఆయన హెచ్చరించారు.

అండమాన్ సముద్రంలో అల్పపీడనం.. ఏపీ తీరం వైపు పయనం!

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం

అదే ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

రానున్న 24 గంటల్లో సుస్పష్ట అల్పపీడనంగా మారే ఛాన్స్

పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్న వ్యవస్థ

అమరావతి వాతావరణ కేంద్రం అధికారిక ప్రకటన

బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ అలజడి మొదలైంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాయుగుండం ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే సూచనలు కనిపిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, నిన్న దక్షిణ అండమాన్ సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం, శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయానికి మరింత స్పష్టంగా రూపుదిద్దుకుని, దక్షిణ అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ అల్పపీడనం అక్టోబర్ 31వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ఒక వాయుగుండంగా కేంద్రీకృతం కానుంది. వాయుగుండంగా మారిన తర్వాత కూడా ఇది పశ్చిమ వాయవ్య దిశలోనే తన ప్రయాణాన్ని కొనసాగించి, రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వాతావరణ పరిణామం ప్రభావంతో రానున్న రోజుల్లో ఏపీ తీర ప్రాంతాల్లో వాతావరణం మారే అవకాశం ఉంది. దీని కదలికలను, తీవ్రతను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు

ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి....

భీమవరం,సువర్ణ జ్యోతి,అక్టోబర్ 30: ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో సిబ్బంది మీ ఇంటికి వచ్చి పింఛన్ల పంపిణీ చేయడం జరుగుతుంద, గౌరవప్రదంగా వ్యవహరిస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, పిల్లల చదువులు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్మును అవసరాలకు తగిన విధంగా వినియోగించుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,అన్నారు.

తుఫాను బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

మొగల్తూరు మండలం మాత్రేవు తుఫాను షెల్టర్‌ను సందర్శించిన సీఎం చంద్రబాబు

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు, సువర్ణ జ్యోతి, అక్టోబర్ 30: అర్నబ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. తుఫాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులతో పాటు, తుఫాను ప్రభావానికి గురైన మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను సందర్శించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. తుఫాను ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించానని, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తుగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందితో పలుమార్లు టెలికాన్ఫరెన్సులు నిర్వహించి అప్రమత్తం చేశామని, తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను హెచ్చరించామని వివరించారు.

ప్రాణనష్టాన్ని తగ్గించగలిగాంలి

తుఫాను హెచ్చరికలపై రాత్రంతా సమీక్షలు నిర్వహించామని సీఎం తెలిపారు. భారీ వర్షాల కారణంగా వరద నీరు చేరే అవకాశాలను అంచనా వేసి కలెక్టర్లను ముందుగానే సన్నద్ధం చేశామన్నారు. గతంతో పోలిస్తే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని, అయినప్పటికీ దురదృష్టవశాత్తూ ఏడుగురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. నిన్న కోనసీమ జిల్లాలో పర్యటించానని, నేడు నర్సాపురం ప్రాంతంలో పర్యటించి నష్టాలను పరిశీలించానని తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

తుఫాను కారణంగా పెద్ద సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయని సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. మరుసటి రోజు సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించడమే లక్ష్యమని పేర్కొన్నారు. తొలుత గృహాలకు, అనంతరం వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు టెలికాం ఆపరేటర్ల టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడ్డాయని, సిగ్నల్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

పశ్చిమగోదావరిలో 12,500 చెట్లు నేలకూలాయిలి

తుఫాను ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లాలోనే సుమారు 12,500 చెట్లు నేలకూలాయని ముఖ్యమంత్రి తెలిపారు. పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని, మిగిలిన చెట్ల వ్యర్థాలను కూడా త్వరితగతిన తొలగిస్తామని చెప్పారు. కొబ్బరి చెట్లు, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. రైతులు పంటలకు బీమా చేయించుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పంటల బీమా చేసుకున్న రైతులకు నష్ట పరిహారం పొందేందుకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

రూ.4,600 కోట్ల నష్టం అంచనాలి

తుఫాను కారణంగా ప్రాథమికంగా రూ.4,600 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని చంద్రబాబు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వివిధ రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. తుఫాను సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతో సమన్వయంగా పనిచేయడం వల్ల తుఫాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోగలిగామని తెలిపారు. తుఫాను కారణంగా జీవనోపాధి దెబ్బతిన్న మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తుఫాను కారణంగా కొబ్బరి చెట్లు నేలకూలి తీవ్రంగా నష్టపోయిన రైతులను కూడా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ, బాధితులకు అవసరమైన సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తుఫాను బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని సీఎం వెల్లడించారు. త్వరలోనే తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. చివరి బాధితుడికి కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నప్పటికీ, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికే ప్రాధాన్యం ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సహాయ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు.

రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులులి

పీఎం-కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద రెండో విడత నిధులను గురువారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు, రెండో ఏడాది రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

గోదావరి డెల్టా ఆధునీకరణతో ముంపు నివారణ

గోదావరి డెల్టా ఆధునీకరణ పనుల ద్వారా ముంపు సమస్యను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు, ప్రజలు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మీడియా సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను బాధితులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులను బాధితులకు అందించారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com